www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

చాళుక్య ద్వారము

తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య బట్టు గంగారావు
కుల సచివులు

సంపాదకులు
డా. తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక : 7 | 16-11-2020 | పుటలు : 4


## నన్నయ ఖ్యాతిని దేశ రాజధానిలో చాటాలి

### రిపబ్లిక్ డే పెరేడ్ క్యాంప్ సెలక్షన్స్ విశేష స్పందన
### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ





**AdikaviNannaya University**

**University Level Pre-Republic Day Parade Camp Selections -2021on 11-11-2020.**

| S.No | Name of volunteer | Name of college |
|---|---|---|
| | **Girl's selected** | |
| 1 | NandamuriVedakumari | SKSD women's college ,Tanuku. |
| 2 | Varghese Princy | SKR college for women,Rajahmundry. |
| 3 | Ch.Hima Bindu | Sri.Y.N. college, Narsapur |
| | **Boy's Selected** | |
| 1 | R. Dinesh Mani Sai | Aditya Degree College, Kakinada |
| 2 | N.Vijay | University College Of Education |
| 3 | Sri Sairam Akella | P.R.Gov Degree College, Kakinada |
| | **Girl's Waiting list** | |
| 1 | D.Keerthi Satya sri | SKSD mahilakalasal,Tanuku |
| 2 | K. Suvarna | SKR college for women |
| | **Boy's Waiting List** | |
| 1 | K. Suresh Kumar | Aditya Degree College,Kakinada |
| 2 | V.SreeCharan Teja | AdikaviNannaya University |
| 3 | R.Ephraim | M.V.N and R.V.R.J.S Collgege,Malikipuram |

ఎంపికైన విద్యార్థుల వివరాలను విడుదల చేసిన రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డా.కెజియారాణి


**మీడియా సెల్, 11.11.20 :** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఖ్యాతిని దేశ రాజధాని ఢిల్లీలో గణతంత్ర దినోత్సవ వేడుకలలో నన్నయ విశ్వవిద్యాలయ విద్యార్థులు చాటాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో బుధవారం నేషనల్ సర్వీస్ స్కీమ్ ఆధ్వర్యంలో ప్రీ రిపబ్లిక్ డే పెరేడ్ క్యాంప్ సెలక్షన్స్ 2020-21 ను నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా వీసీ మొక్కా జగన్నాథరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించిన ఎన్.ఎస్.ఎస్ యూనిట్లుకు అభినందనలు తెలిపారు. ప్రపంచ దేశాలలోనే శక్తివంతమైన యువ జనాభా భారతదేశంలో ఉందని ఆ శక్తిని దేశాభివృద్ధి కోసం ఉపయోగించుకోవాలని అన్నారు. నేటి కాలంలో యువత సోషల్ మీడియా మాయాజాలంలో పడి సమయాన్ని వృధా చేసుకుంటుందని చెప్పారు. ఎంత ఖర్చుచేసిన గడిచిపోయిన సమయాన్ని తిరిగి తీసుకురాలేమని కాబట్టి ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ దేశాభివృద్ధికి పాటుపడాలని అన్నారు. దేశభక్తిలో కరోనాను లెక్కచేయకుండా సెలక్షన్స్ కు వచ్చిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వీసీ అభినందనలు తెలిపారు. యువత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే దిశగా ప్రయత్నాలు చేయాలని సూచించారు. తరువాత రీజినల్ డైరెక్టర్ ఎం.రామకృష్ణ మాట్లాడుతూ భారతదేశంలో ఐదు జోన్లలో సెలక్షన్స్ జరుగుతున్నాయని దానిలో భాగంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో వెస్ట్ జోన్ ఆధ్వర్యంలో సెలక్షన్స్ ప్రక్రియను నిర్వహించామని అన్నారు. 2 సంవత్సరాలు ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్గా ఉండి 1 స్పెషల్ క్యాంప్ లో పాల్గొని, బరువు, ఎత్తు ఉన్న విద్యార్థులను ఆయా కళాశాలల నుండి ఎంపిక చేసామని చెప్పారు. రన్నింగ్, మార్చ్‌పస్ట్, ఎక్స్‌ట్రా కర్యుక్యులర్ యాక్టివిటీస్ లో ప్రతిభ పోటీలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తామని అన్నారు. వీరిని ప్రీ ఆర్.డి. సెలక్షన్స్ కు పంపుతామని అక్కడ శిక్షణ పొంది ఎంపికైన వారిని రిపబ్లిక్ డే పెరేడ్ కు పంపిస్తామని అన్నారు. తరువాత ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డా.బి.కెజియారాణి మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల నుండి 75 మంది విద్యార్థులు ఈ ఎంపికలలో పాల్గొన్నారని అన్నారు. భౌతికదూరం పాటిస్తూ వారికి వివిధ పోటీలను నిర్వహించామని చెప్పారు. అనంతరం ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావును, రిజినల్ డైరెక్టర్ ను సన్మానించి జ్ఞాపికను అందజేసారు. 2020 పెరేడ్ లో పాల్గొన్న బి.ఎస్.గాయత్రి, పి.కళ్యాణిలక్ష్మీ లకు జ్ఞాపికలను అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డా.బి.కెజియారాణి, ప్రోగ్రామ్ అధికారులు జె.సురేష్, జి.వి.ఎస్.నాగేశ్వరరావు, పద్మవల్లి, అనిత, మల్లిప్రియ, రాహుల్, ప్రసాద్, రాజమణి పాల్గొన్నారు.



అంతర్జాతీయ వర్క్ షాపులో మాట్లాడుతున్న వీసీ, రిజిస్ట్రార్

## ప్రపంచ స్థాయి పరిశోధన పద్ధతులు అలవర్చుకోవాలి

**మీడియా సెల్, 13.11.20 :** ప్రపంచమంతా కుగ్రామంగా ఉన్న నేటి ఆధునిక కాలంలో ప్రపంచ స్థాయి పరిశోధన పద్ధతులను అలవర్చుకుని సమాజహితమైన పరిశోధనలు భావితరాలకు అందించాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఐఈఈఈ కామ్‌సాక్ బెంగళూరు మరియు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ సి.ఎస్.ఈ. విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల అంతర్జాతీయ వర్క్ షాప్ ఆన్‌లైన్ లో శుక్రవారం ప్రారంభించారు. "రిసెర్చ్ మెథడాలజీ అండ్ ఐఈఈఈ అథర్షిప్ ల్యాబ్" అనే అంశంపై జరిగే రెండు రోజుల అంతర్జాతీయ సదస్సుకు ఆర్గనైజర్ అండ్ కన్వీనర్ గా సి.ఎస్.ఈ. అధ్యాపకురాలు, ఐఈఈఈ మెంబర్ టి.త్రిత్వజ్యోతికిరణ్ వ్యవహిరించారు. దీనికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై ఉపన్యసించారు. ప్రపంచంలోని 160 కి పైగా దేశాలలో 4,19,000 మందికి పైగా సభ్యులు సాంకేతిక ప్రమాణాలు, వృత్తిపరమైన మరియు విద్యా కార్యకలాపాలతో ఐఈఈఈ లో ఉన్నారని అన్నారు. ఇంజనీరింగ్, కంప్యూటింగ్ మరియు సాంకేతిక సమాచారంలో ఎంతో విశిష్ట చరిత్ర కలిగిన ఐఈఈఈ సోసైటీతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తొలిసారిగా అంతర్జాతీయ వర్క్ షాపును నిర్వహించడం హర్షనీయమని అన్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలను అనుసరించి సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు అందించాలని చెప్పారు. సమగ్రమైన పరిశోధన పద్ధతులను అవలంభించడం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని తెలిపారు. ప్రస్తుత కాలంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అవసరమైన పరిశోధన అంశాలను గురించి చర్చించారు. అలాగే విశ్వవిద్యాలయంలో లాక్ డౌన్ సమయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని విజ్ఞానాన్ని వికసింపచేసిన విధానాలను ప్రస్తావించారు. రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు మాట్లాడుతు ఐఈఈఈ వంటి అంతర్జాతీయ సంస్థతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం భాగస్వామ్యమై అంతర్జాతీయ వర్క్ షాప్ ను నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు. ఇటువంటి వర్క్ షాపుల ద్వారా పరిశోధన విద్యార్థులకు, అధ్యాపకులకు ఎంతో మేలు చేకురుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, విభాగాధిపతి డా.పి.వెంకటేశ్వరరావు, వర్క్ షాపు కన్వీనర్ టి.త్రిత్వజ్యోతికిరణ్, ఐఈఈఈ నుండి డా.నవీన్ కుమార్, శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు.



## సంపాదకీయం




# బాల్యం - అమూల్యం

చాలా పెద్ద ఆఫీసు. అందులో నిజాయితీ గల మేనేజర్. ఆయన ముఖ్యమైన నిర్ణయాలుతీసుకునేటపుడు జేబులోంచి చిన్న ఫోటో తీసి చూసుకునేవాడు. అక్కడున్న ఉద్యోగులకు ఎవరికీ ఆ ఫోటోలో ఏముందో తెలియదు. దేవుని ఫోటో అని , వాళ్ళమ్మగారి ఫోటో అని , భార్య ఫోటో అని, ఏదో మంత్రమని ఎవరికి తోచినట్లు వాళ్ళు అనుకునేవారు. కొంతకాలం తర్వాత ఆయన రిటైరయ్యారు. సాయంత్రం వీడ్కోలు సభలో ఓ కుర్ర ఉద్యోగి ఉండబట్టలేక మీ జేబులోని ఫోటోలో ఏముందని అడిగాడు. ఆయన మాట్లాడుతూ , ఒనవ్వు నవ్వి 'మీ అందరికీ నా జేబులోని ఫోటో ఏమిటనేది చాలా ఆసక్తిగా ఉందని అర్థమయింది. ఏం లేదు. అది నా చిన్నప్పటి ఫోటో. బాల్యంలో ఏ మాయా, మర్మం , అన్యాయం, అవినీతి, మోసం, స్వార్థం అంటే ఏమిటో తెలియకుండా జీవిస్తాం. ఎదిగే కొద్దీ అవి మనల్ని కబలించి తమ వశం చేసుకోవాలని ప్రయత్నిస్తాయి. అందుకని కీలకమైన నిర్ణయాలు, సంతకాలు చేస్తున్నపుడు ఏ ప్రలోభాలకు లోనుకాకుండా నా బాల్యం నాకు గుర్తు రావటానికి, అలాగే జీవించడానికి నా చిన్నప్పటి ఫోటోను నేను చూసుకుంటూ ఉండేవాణ్ణి ' అన్నాడు. అవును. జీవితమంటే చిన్నచిన్న ఆనందాలే. మాయామర్మం లేని పసితనాన్ని ఎవ్వరూ మర్చిపోకూడదు. బాల్యమిచ్చే సందేశం కూడా అదే ! ప్రస్తుతం అనే దానిలో మమేకమైన ఆనందాన్ని, నిజాయితీని నింపుకోవటమే బాల్యాన్ని కొనసాగించటం. బాల్యంలో మన నవ్వు హృదయంలోంచి వస్తుంది. వస్తూ . . . వస్తూ . . . బండెడు ప్రేమను కూడా మోసుకొస్తుంది. నిష్కల్మషంగా పిల్లల్లా నవ్వాలంటే ఎవరికి వారు తమ పసితనాన్ని ఆవాహనం చేసుకోవాలి. బాల్యమొక పవిత్ర స్వర్గం , అమాయకమైన స్వప్నం. కాగితం మీద నిజాల్ని పోసి బొమ్మల్ని గీసేమర్మం లేని జ్ఞాపకం.

*బాల్యం ఎంత సరదా అయిందో బ్రతుకు కొనవరకూ జీవితం కూడా అంతే సరదా అయింది. బాల్యం పరచుకున్న ఒక నవ్వుల మైదానం. బడిలో, గుడిలో, అణువణువులో యధేచ్ఛగా, ప్రశాంతంగా విహరించే ఒక స్వేచ్ఛ ! చిటికెన వేలు పట్టుకొని నడుస్తున్న చిన్న పిల్లవాడు చాలు - పిల్లల ప్రపంచం ఎంత మహత్తరమైందో చెప్పడానికి, సంతృప్తిగా, ఆనందంగా జీవించటమంటేమిటో నిర్ణయించటానికి.*

***ఏదేమైనా - బాల్యం తిరిగిరాని అమూల్యం !!***

# గురుస్థాన గౌరవాన్ని కాపాడాలి


## వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు



**మీడియా సెల్, 09.11.20 :** సమాజంలో ఏ వృత్తికి లేని గౌరవం గురువునకు ఉందని దానిని కాపాడుకోవల్సిన బాధ్యత గురువులందరిపై ఉందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అధ్యాపకులకు కన్వీనర్ సెంటర్ లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అధ్యాపకులను ఉద్దేశించి మాట్లాడుతూ గురువు స్థానానికి ఉన్న గౌరవన్ని కాపాడాలని అన్నారు. కోవిడ్ నేపథ్యంలో లాక్ డౌన్ సమయంలో ప్రతీ ఒక్కరు వెబినార్లు నిర్వహించి విజ్ఞానాన్ని వికసింపచేసినందుకు అభినందనలు తెలియజేసారు. ప్రస్తుతం నూతన విద్యా సంవత్సరం 2020-21 ప్రారంభమైందని 1/3 వంతు విద్యార్థులు తరగుతులకు హాజరవుతారని చెప్పారు. ప్రత్యక్షంగా తరగతులకు హాజరైన విద్యార్థులచే ప్రాక్టికల్స్, ప్రయోగశాల వంటివి పూర్తి చేయించాలని తెలిపారు. బోధన పద్ధతుల్లో అధ్యాపకుల ప్రత్యేక నాణ్యత ప్రమాణాలు పాటించాలని విద్యార్థులను పరిశోధకులుగా తీర్చిదిద్దాలని అన్నారు. అధ్యాపకులు పరిశోధనలపై మక్కువ పెంచుకొని ఎక్కువ పరిశోధన పత్రాలను ప్రచురించాలని అన్నారు. తమతమ విభాగాలకు సంబంధించిన సంస్థలు, శాఖలతో సంయుక్తంగా కార్యక్రమాలను, పరిశోధనలను, ప్రోజెక్టులను నిర్వహించడం వంటి విద్యాపరమైన కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. విభాగాలను, ల్యాబ్ లను పటిష్టపరచుకొని నాణ్యమైన విద్యను అందించాలని తెలిపారు. ఎటువంటి సమస్యలు, సూచనలు ఉన్నా వెంటనే తెలియజేసేందుకు ప్రత్యేక ఆన్ లైన్ డేష్ బోర్డును ఏర్పాటు చేస్తున్నామన్నారు. కుల, మత, రాజకీయ, ప్రాంతాలకు అతీతంగా పని చేసే వారికి ప్రాధాన్యత ఉంటుందని, విశ్వవిద్యాలయాన్ని తల్లివలె భావించి విద్యార్థులతో సత్ ప్రవర్తన కలిగి ఉండాలని చెప్పారు. మన విశ్వవిద్యాలయానికి మన వంతు కాంట్రిబ్యూషన్ ను అందించి బాధ్యతగల గురువులుగా సమాజంలో ఎదగాలని తెలిపారు. సమష్టి కృషితో విద్యాపరంగా విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సహకరించాలని తెలియజేసారు.

# విద్యలో సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యమివ్వాలి

**మీడియా సెల్, 12.11.20 :** విద్యా రంగంలో సాంకేతిక పరిజ్ఞానానికి అధిక ప్రాధాన్యమివ్వాలని ఆధునిక విధానాలను అనుసరించి నాణ్యమైన విజ్ఞానాన్ని అందించాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో "విద్యలో సాంకేతిక పరిజ్ఞానం — అనుకులతలు, పర్యవసానాలు" అనే అంశంపై రెండు రోజుల జాతీయ వెబినార్ ను నిర్వహించారు. దీనికి ఛైర్మన్ గా ప్రిన్సిపాల్ డా.కె.సుబ్బారావు, కన్వీనర్ గా కోర్సు కోఆర్డినేటర్ డా.జి.ఎలీషాబాబు వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై ఉపన్యసించారు. ఆధునిక యుగంలో సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా అభివద్ధి చెందుతుందని అన్ని రంగాలు సాంకేతికతతో మంచి ఫలితాలను సాధిస్తున్నారని చెప్పారు. అలాగే విద్యారంగంలో కూడా సాంకేతక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని మెరుగైన ఫలితాలు చూడవచ్చునని తెలిపారు.




వెబినార్ లో మాట్లాడుతున్న వీసీ మొక్కా జగన్నాథరావు

దీనిలో భాగంగా కోవిడ్ సమయంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని సాధించిన విజయాలను ప్రస్తవించారు. జాతీయ అంతర్జాతీయ సదస్సులు, వెబినార్లు, వర్క్ షాప్ లు, ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమాలు వంటివి ఆన్ లైన్ ద్వారా నిర్వహించి ఈ-సర్టిఫికెట్లును కూడా అందించామని చెప్పారు. సుమారు 70 ఆన్ లైన్ వెబినార్లు నిర్వహించి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నెంబర్ వన్ స్థానంలో నిలిచామని తెలిపారు. జెస్టోర్, జేగేట్, ఈకంటెంట్, ఆన్ లైన్ క్లాసులు వంటి సాంకేతిక విధానాలను విశ్వవిద్యాలయంలో ప్రారంభించి విద్యా ప్రగతికి పాటుపడుతున్నామని తెలియజేసారు. రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు మాట్లాడుతూ కోవిడ్ సమయంలో విశ్వవిద్యాలయంలో అనేక సాంకేతిక విజ్ఞానాన్ని అందించామని దీనిని మార్గదర్శకంగా తీసుకొని అనుబంధ కళాశాలలు సాంకేతిక పరిజ్ఞానంలో అభివద్ధిని సాధించాలని చెప్పారు. ప్రస్తుతం 1/3 వంతు క్లాసులు జరుగుతున్నాయని మిగిలిన విద్యార్థులకు అవసరమైన విజ్ఞానాన్ని నాణ్యమైన ఆన్ లైన్ విధానాల ద్వారా అందించాలని తెలియజేసారు. విద్యలో సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించి పలు అంశాలపై ఈ రెండు రోజుల సదస్సులో ఆచార్య కె.పి.సుబ్బారావు, ఆచార్య కె.పుష్పానందం, ఆచార్య బి.రమేష్ బాబు, డా.వి.పెర్సిస్ లు ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ప్రిన్సిపాల్ డా.కె.సుబ్బారావు, కన్వీనర్ డా.జి.ఎలీషాబాబు, కోకన్వీనర్లు ఆర్.సాంబశివరావు, డా.ఎం.గోపాలకష్ణ, జె.రాజమణి, డా.ఎన్.సుజాత, కె.ఎస్.ఆర్.రాజేశ్వరిదేవి తదితరులు పాల్గొన్నారు.






## పుస్తకం



**సత్యం శంకరమంచి**
**అమరావతి కథలు**

అమరావతి కథలలో రచయిత సొంత ఊరి సాంఘిక జీవితంతో పాటు తాను తిరిగిన మట్టివాసన, గతానుభవాల అందమైన స్మరణ ఈ కథలకు ప్రేరణ. **ఒకరోజెళ్లిపోయింది** కథలో కాలానికి తెలియకుండా కాలంతోకలిసిపోయి బ్రతకాలని.. **రాగిచెంబులో చేపపిల్ల** కథలో ముత్యంలాగా బ్రతకటం కాదు, నీళ్లలో చేపపిల్లలాగా బ్రతకాలని చెప్పిన వాక్యాలు రచయిత జీవితానికి శీర్షికలు. ఇందులో ఓ వంద కథలున్నాయి. ఇవన్నీ ప్రేమతో, భక్తితో, ఆవేశంతో సత్యంగారి హదయంలోంచి ఉప్పొంగాయి.జలపాతంలా ఉరికాయి.ఈ కథలకు బాపుగారు వేసిన చిత్రాలు కేవలం బొమ్మలు కావు. రూపానువాదాలు.అద్భుత వ్యాఖ్యానాలు. ప్రేమతో, శ్రద్ధతో చదవండి. ఇలా మొబైల్ ఫోన్లో, కంప్యూటర్ లో చదవటం కష్టమనిపిస్తే కొద్దిరోజుల తర్వాత అలా పుస్తకాల షాపుకి వెళ్ళినప్పుడు సొంత పుస్తకంగా కొనండి. పుస్తకాన్ని ఇంట్లో కనిపించేలా ఉంచండి. ఇంట్లోవాళ్ళంతా చదువుతారు.

ముళ్ళపూడి వెంకటరమణ గారు చెప్పినమాటను గమనించండి. అమరావతి కథలు తెలుగుసాహిత్య పీఠంలో కలకాలం నిలబడి గౌరవం, ఆదరణ పొందే ఒక మహోజ్వల సృష్టి. ఎన్నటికీ ఆరని అఖండ జ్యోతి.పాఠకులకు, కళాకారులకు ఎన్నిసార్లు ఆస్వాదించినా తనివితీరని అమృతకలశం. అక్షయమైన అక్షరపాత్ర. శిల్పసౌందర్యానికి పరమావధి. ప్రపంచ సాహితీవీధిలో తెలుగువారు సగర్వంగా ఎగరేయగల పతాకం!!

## పీజీ పరీక్ష ఫలితాలు విడుదల చేసిన వీసీ

**మీడియా సెల్, 11.11.20 :** ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ పరిధిలో పీజీ నాలుగవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు బుధవారం విడుదల చేసారు. 4002 మంది విద్యార్థులు పీజీ పరీక్షలు వ్రాసారని వీరిలో 3234 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని అన్నారు. ఉత్తీర్ణత శాతం 81 గా ఉందని చెప్పారు. కోవిడ్ సమయంలో సమర్థవంతంగా పరీక్షలు నిర్వహించిన పరీక్ష నిర్వహణ అధికారులను వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జామినేషన్ డీన్ డా.ఎ.మట్టారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎస్.లింగారెడ్డి, బి.విజయకుమారి, గోపాలకష్ణ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్ రాజేష్ మృతికి సంతాపం

**మీడియా సెల్, 12.11.20 :** ఆదికవి నన్నయ యూనివర్సిటీలో బస్సు డ్రైవర్ గా పని చేస్తున్న పసలపూడి రాజేష్ (38) ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందారు. విశ్వవిద్యాలయంలో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజేష్ చిత్రపటానికి వీసీ మొక్కా జగన్నాథరావు పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో డా.కె.సూకరత్నం, ఎస్.లింగారెడ్డి, డా.బి.రామ్ గోపాల్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామీణ నేపథ్యం - ప్రభుత్వోద్యోగం



### స్ఫూర్తి

హాయ్ ! నాపేరు సాయి మాధురి. మాది తూర్పుగోదావరి జిల్లా మలికిపురం మండలంలోని కేశనపల్లి గ్రామం. మా నాన్నగారి పేరు వెంకట సూర్యనారాయణ మూర్తి . . . ప్రైవేటు పాఠశాలలో ప్రిన్సిపల్‌గా సేవలనందిస్తున్నారు. మా అమ్మగారి పేరు జయలక్ష్మి . . గృహిణి. నా విద్యాభ్యాసం విషయానికొస్తే 1 నుండి 10 వ తరగతి వరకు గ్రామంలోని పాఠశాలల్లో సాగింది. తదుపరి ఇంటర్మీడియట్ , డిగ్రీ సుమారు 6 కిలోమీటర్ల దూరంలోని లక్కవరం గ్రామంలో కొనసాగించాను. స్కూల్లో ఉండగా తోటి విద్యార్థులంతా ఫిజిక్సు సబ్జెక్టు చాలా కష్టమని, ఎక్కువ మార్కులు తెచ్చుకోలేమని అంటుండడం నాలో పట్టుదలను పెంచింది. ఫిజిక్సుపై మక్కువ పెంచుకుని కష్టపడి చదివాను. డిగ్రీ తరువాత బి.ఈ.డి. ఎంట్రన్స్‌లో మంచి ర్యాంకు సాధించి 30 కిలోమీటర్ల దూరంలోని అమలాపురం మిరియం కాలేజీలో 2014 – 15 బ్యాచ్‌లో ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసాను. మొదటి మెథడాలజీ ఫిజిక్స్, రెండవ మెథడాలజీ మేథ్స్ . తర్వాత నన్నయ సెట్‌లో ఫిజిక్స్‌లో 52 వ ర్యాంకు సాధించి యూనివర్సిటీ క్యాంపస్‌లో సీటు సంపాదించాను. 2016 – 18 బ్యాచ్‌కుచెందిన నాకు సుష్మ మేడం, సుబ్బారావు సర్ , రాజ్యలక్ష్మి మేడం, రాజశేఖర్ సర్ అందించిన ప్రోత్సాహం, సలహాలు, సూచనలు ఫిజిక్స్ సబ్జెక్టుపై మరింత పట్టు సాధించడానికి దోహదపడ్డాయి. అదే టైంలో టెట్ నోటిఫికేషన్ రావడం . . . ప్రిపరేషన్‌లో సుష్మ మేడం నాకు మరింత ప్రోత్సాహం, ఉత్సాహం అందించారు. నా సోదరుడు సతీష్ కుమార్ నేతృత్వంలో నిరంతర శ్రమతో 2017 టెట్‌లో 110 మార్కులు సాధించి, గ్రామీణ విద్యార్థులు కాంపిటీటివ్ పరీక్షల్లో నెగ్గుకు రాలేరు అనే భావన తప్పు . . . కష్టపడితే ఏ నేపథ్యం అయినా . . . ఏ ప్రాంతం అయినా విజయం సాధించవచ్చు అని నిరూపించగలిగాను.

పి.జి. పూర్తి అయిన వెంటనే అవనిగడ్డ ప్రగతిలో స్వల్పకాలిక కోచింగ్ తీసుకున్నాను. డి.యస్సీ 2018 లో ఫిజికల్ సైన్స్ విభాగంలో తూర్పుగోదావరి జిల్లాలో 20 వ ర్యాంకు సాధించి మొదటి ప్రయత్నంలోనే స్కూల్ అసిస్టెంటుగా సెలక్ట్ అయ్యి రౌతులపూడి మండలం యస్. అగ్రహారం జెడ్.పి.హెచ్ స్కూల్లో సేవలనందిస్తున్నాను. ఎదుటివారి మాటలకు నిరుత్సాహపడ కుండా . . . ఒక లక్ష్యం ఏర్పరచుకుని , కష్టపడి పనిచేస్తే సాధించలేనిదంటూ ఏదీ ఉండదు .

**కలలు కనండి . . కష్టపడండి.. సమయం విలువ తెలుసుకుని , కాలాన్ని సద్వినియోగం చేసుకోండి. ఫలితం సాధించండి.**

నా లక్ష్య సాధనలో నాకు సహకరించిన అందరికీ పేరుపేరునా ధన్యవాదములు తెలియజేస్తున్నాను.

పూర్వవిద్యార్థి, **పి. సాయి మాధురి,**
**స్కూల్ అసిస్టెంట్, రౌతులపూడి**
**తూర్పుగోదావరి, ఆంధ్రప్రదేశ్**

## విద్యా వ్యవస్థలో మహనీయుడు మౌలానా ఆజాద్

**మీడియా సెల్, 11.11.20 :** భారతదేశ విద్యా వ్యవస్థకు పునాదులు వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి వీసీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్రను పోషించిన అబుల్ కలాం ఆజాద్ మహనీయుడని అన్నారు. దేశభక్తితో అనేక ఉద్యమాలలో పాల్గొని క్విట్ ఇండియా ఉద్యమంలో జైల్ శిక్షను అనుభవించారని తెలిపారు. భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా అబుల్ కలాం ఆజాద్ ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. ఉన్నత విద్యా సంస్థలలో పని చేస్తున్న అధ్యాపకులంతా ఆజాద్ వంటి ఉన్నత ఆలోచనలతో దేశకోసం పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య కొట్టి శ్రీరమేష్, డా.కె.రమణేశ్వరి, డా.డి.జ్యోతిర్మయి, డా.ఎం.కమలకుమారి, డా.ఎ.మట్టారెడ్డి, ఆచార్య.పి.సురేష్ వర్మ, డా.ఎం.గోపాలకష్ణ, నందెపు నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



### మంచి మాట

**విద్యాధనం శ్రేష్ఠధనం**
**తన్మూల మితరద్ ధనం ।**
**దానేన వర్ధతే నిత్యం**
**న భారాయ ననీయతే ॥**

సంపదలన్నిటిలోనికీ విద్యాసంపద గొప్పది. ఇతర సంపదలన్నిటినీ విద్యవలన సాధించవచ్చు. అది ఇచ్చిన కొద్దీ వృద్ధి పొందుతుంది కానీ తరగదు. వహించే వానికి విద్య బరువు కాదు. దొంగలపాలు అసలే కాదు.

**విద్య అంత మహత్తరమైనది.**

# ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

## ప్రాంగణ కళాశాలల విశేషాలు

## యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం ప్రాగణంలో నాలుగు కళాశాలలు ప్రధానమైనవి. ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల, సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల, విద్యా కళాశాల(ఉపాధ్యాయ శిక్షణ). ఈ సంచికలో సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలోని విభాగాల విశేషాలు. విశ్వవిద్యాలయ ప్రారంభం నుంచి నెలకొల్పిన కోర్సులతో 2006 నుండి ఒకే కళాశాలగా ఉన్న విధానాన్ని అనేక కొత్త కోర్సులు, విభాగాలు ఏర్పడిన తరువాత 2013 నుండి ఈ కళాశాలలు ప్రత్యేక వ్యవస్థలుగా ఏర్పాడ్డాయి. సైన్స్ కళాశాల ఆచార్యులు మైనర్, మేజర్ ప్రోజెక్టులను నిర్వహించడం కీలక పాత్రను పోషిస్తున్నారు. జెస్టోర్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నాణ్యమైన గ్రంథాలను ఆన్ లైన్ ద్వారా పొందే సదుపాయం ఉంది. విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంథాలయంలో అన్ని విభాగాలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఎన్.ఎస్.ఎస్, స్పోర్ట్స్, యోగా విభాగాలలో ఆర్ట్స్ విద్యార్థులు తమ ప్రతిభను కనపరుస్తున్నారు. విద్యార్థులకు హాస్టల్, యూనియన్ బ్యాంక్, పోస్ట్ ఆఫీస్, హాస్పటల్ వంటి సౌకర్యాలు ఉన్నాయి. యూజీసీ కొన్ని సర్టిఫికెట్టు కోర్సులను ఈ ఏడాది నుండి అందిస్తున్నారు.

### జూవాలజీ 2006
### ఆక్వాకల్చర్, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ - 2016



సీట్లు : 16,16,16,16
ఆచార్యులు సంఖ్య : 11
ల్యాబ్స్ –3, మ్యూజియం – 1
నెట్/సెట్ అర్హత సాధించిన వారు : 10
పిహెచ్.డి. పరిశోధన : పూర్తి చేసిన వారు: 13, చేస్తున్నవారి సంఖ్య: 5
జాతీయ, అంతర్జాతీయ సదస్సుల సంఖ్య :10, వర్సిటీ చేపల చెరువు అభివృద్ధి



### జియాలజీ 2013, జియోఫిజిక్స్ 2017



సీట్లు : 20, 30
ఆచార్యులు సంఖ్య : 8
ల్యాబ్స్ : 3, మ్యూజియం : 1
నెట్/సెట్ అర్హత సాధించిన వారు : 5
పిహెచ్.డి. పరిశోధన : పూర్తి చేసిన వారు: 2, చేస్తున్నవారి సంఖ్య:12
జాతీయ, అంతర్జాతీయ సదస్సుల సంఖ్య : 7, మెరుగైన ఉద్యోగావకాశాలు

### ఫిజిక్స్ 2014



సీట్లు : 30
ఆచార్యులు సంఖ్య : 4
ల్యాబ్స్ : 4
నెట్/సెట్ అర్హత సాధించిన వారు: 10
పిహెచ్.డి. పరిశోధన : పూర్తి చేసిన వారు :1, చేస్తున్నవారి సంఖ్య : 3
జాతీయ, అంతర్జాతీయ సదస్సుల సంఖ్య : 4
ఇస్రో, బార్క్ లలో ఉద్యోగావకాశాలు



### పరిశోధనలకు ప్రాధాన్యమిస్తున్నాం

**— డా.కె.రమణేశ్వరి**

పరిశోధనలలో సైన్స్ కళాశాల ప్రాధన్యత ఇస్తుంది. అధునాత ల్యాబ్స్ ఉన్నాయి. ప్రముఖ పరిశ్రమలు, సంస్థలు, విశ్వవిద్యాలయాలతో అవగాహాన ఒప్పందాలు కుదుర్చుకున్నాము. మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్స్, డిపార్టమెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నుండి మైనర్, మేజర్ ప్రోజెక్టులు సైన్స్ కళాశాలకు వచ్చాయి. సెంట్రల్ ఇన్స్టుమెంటేషన్ ఫెసిలిటీ, విభాగాలను పటిష్టపరచడం, కర్య్బులమ్ రివిజన్, ఇండస్ట్రీ విజిట్స్ నిర్వహిస్తున్నాం. ప్లేస్మెంట్స్, క్యాంపస్ డ్రైవ్స్ నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాం. విద్యార్థులకు విజ్ఞాన, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు మధ్య ఉన్న దూరాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం.

విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా సైన్స్ ఆచార్యులు మొక్కా జగన్నాథరావు గారు సేవలందించడంతో విశ్వవిద్యాలయంలోని సైన్స్ కళాశాల మరింత అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నాం. ప్రస్తుతం విద్యాపరంగాను, పరిశోధనపరంగాను విశ్వవిద్యాలయం అడుగులు వేస్తుంది. విద్యార్థులకు చక్కని ఉద్యోగవకాశాలు కల్పించేందుకు ప్లేస్మంట్ సెల్ పని చేస్తుంది.

**– డా.బి.జగన్మోహనరెడ్డి, ఈసీ మెంబర్**

### కెమిస్ట్రీ 2006, ఎనలైటికల్ కెమిస్ట్రీ 2016



సీట్లు : 40, 15
ఆచార్యులు సంఖ్య : 7
ల్యాబ్స్ : 6
నెట్/సెట్ అర్హత సాధించిన వారు : 28
పిహెచ్.డి. పరిశోధన : పూర్తి చేసిన వారు : 7, చేస్తున్నవారి సంఖ్య :7
జాతీయ, అంతర్జాతీయ సదస్సుల సంఖ్య : 12
100 శాతం ఉద్యోగావకాశాలు

### మేథమెటిక్స్ 2014, అప్లైడ్ మేథమెటిక్స్ 2016



సీట్లు : 45, 45
ఆచార్యులు సంఖ్య : 7
ల్యాబ్స్ : 1
నెట్/సెట్ అర్హత సాధించిన వారు : 2
పిహెచ్.డి. పరిశోధన : పూర్తి చేసిన వారు : 11, చేస్తున్నవారి సంఖ్య : 4
జాతీయ, అంతర్జాతీయ సదస్సుల సంఖ్య : 2
పరిశోధనలు, టీచింగ్, సాఫ్ట్వేర్ రంగాలలో ఉద్యోగావకాశాలు

### బోటని 2015



సీట్లు : 30
ఆచార్యులు సంఖ్య : 4
ల్యాబ్స్ : 2
నెట్/సెట్ అర్హత సాధించిన వారు : 3
జాతీయ, అంతర్జాతీయ సదస్సుల సంఖ్య : 6
యూజీసీ సర్టిఫికెట్టు కోర్సు, బొటానికల్ గార్డెన్ అభివృద్ధి, బొటానికల్ టూర్స్



(ఇవి 2020–2021 విద్యాసంత్సరం అక్టోబర్ నాటికి వివరాలు)

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్:- nannayavani@aknu.edu.in